ప్రజాశక్తి

బుధవారం 10 ఏప్రిల్ 2024 పేజీలు 8

విజయనగరం

పార్వతీపురం మన్యం

ఉగాది వేడుకల్లో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ కార్తీక్, అధికారులు

ఘనంగా ఉగాది వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు స్థానిక మన్నార్ రాజ గోపాలస్వామి ఆలయంలో మంగళ వారం సంప్రదాయబద్ధంగా జరిగాయి. ఈ వేడుకలకు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఆయనకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీ మన్నార్ రాజగోపాల స్వామిని జెసి దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వారణాశి ధర్మారావు శర్మ పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఈ ఏడాది విద్య, వైద్యం, సాంకేతిక, క్రీడారంగాలు, పర్యాటకం, సంగీతం, సాహిత్యం, కళా రంగాలు అబివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. ఉగాది సందర్భం గా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో, 60 ఏళ్ల దాటిన ప్రముఖ అర్చకులు దొంతుకర్తి సోమేశ్వర శర్మ(శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయం, ఎల్.కోట), భద్రం అప్పలాచార్యులు (శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం, బొబ్బిలి), మురపాక వెంకట శేషుబాబు (రామలింగేశ్వర స్వామి ఆలయం, జి.అగ్రహారం) లను ఘనంగా సన్మానించారు. వీరికి ఒక్కొక్కరికి రూ,10,116 నగదు పురస్కారం, ప్రశంసా పత్రంతోపాటు దుశ్శాలువతో సత్కరించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. నాదస్వరం, అన్నమాచార్య కీర్తనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ, సిపిఒ పి.బాలాజీ, పశు సంవర్ధకశాఖ జెడి డాక్టర్ విశ్వేశ్వరరావు, వ్యవసాయశాఖ జెడి తారకరామారావు, మెప్మా పీడీ సుధాకరరావు, మున్సిపల్ సహాయ కమిషనర్ తిరుమలరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర్, తాహశీల్దార్ పివి రత్నం, రాజగోపాలస్వామి ఆలయ ఇఒ వంశీలక్ష్మి, వివిధ ఆలయాల ఇఒలు, దేవాదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే నాయకుడు..రెండు పార్టీలు

- టిడిపికి రాజీనామా చేయకుండానే జనసేనలో చేరిక
- టిక్కెట్ కోసం తంటాలు • అయోమయంలో టిడిపి కేడర్
- పాలకొండలో వింతరాజకీయం

పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరుతున్న జయకృష్ణ (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/పాలకొండ

అనగనగా ఒక నాయకుడు... మరో నాయకురాలు... ఇందులో ఒకరు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి... మరొకరు టిడిపి నియోజకవర్గ స్థాయి నాయకురాలు. వారం రోజుల వ్యవధిలో ఇద్దరూ ఒకరికొకరు పోటీగా జనసేన అధినేతను కలిసి ఆ పార్టీ కండువా కప్పేసుకున్నారు. తమ కేడర్‌కు ఇక మనం జనసేనలో చేరిపోయినట్టే అంటూ ఇద్దరూ ఎవరికి వారే చెప్పుకుంటున్నారు. అలాగని టిడిపికి రాజీనామా చేశారా? అంటే అటువంటి నీతి ఎక్కడా కనిపించలేదు. దీంతో, ఏం చెయ్యాలో అర్థం కాక ఆయా పార్టీలకు చెందిన దిగువస్థాయి నాయకులు, కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. ఇక సాధారణ జనం కూడా వీరి రాజకీయ విన్యాలసాలను చూసి విస్తుపోతున్నారు. ఇదీ పాలకొండ టిడిపి, జనసేన పార్టీల్లో నెలకున్న దుస్థితి. పాలకొండ నియోజకవర్గం వైసిపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే విశ్వసరాయ కళావతిని ప్రకటించిన విషయం విధితమే. టిడిపి, జనసేన, బిజెపి కూటమిలో భాగంగా జనసేన అభ్యర్థిని పోటీలో నిలిపేందుకు నిర్ణయించుకున్నారు. నిర్ణయమైతే జరిగింది గానీ, అంతపాటి అభ్యర్థి లేరట. ఆ మాటకొస్తే అభ్యర్థి మాత్రమే కాదు. కార్యకర్తలు కూడా ఆ పార్టీకి పెద్దగా లేరు. దీంతో, జనసేనకు ఏం చేయాలో అర్థంగాని పరిస్థితి. దీంతో, టిడిపి తరపున టిక్కెట్ ఆశిస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఈనెల 1వ తేదీన పిఠాపురం వారాహి యాత్రలోవున్న పవన్ కల్యాణ్‌ను కలిసి జనసేన కండువా కప్పేసుకున్నారు. కండువా కప్పుకున్నదే తడువుగా నియోజకవర్గంలోకి వచ్చి తాను జనసేనలో చేరిపోయాయని, ఆ పార్టీ తరపున పాలకొండ అసెంబ్లీ అభ్యర్థిగా తనను ప్రకటిస్తారని తెగేసి చెప్పుకుంటున్నారు. దీంతో, అప్రమత్తమైన మరో టిడిపి టిక్కెట్ ఆశావహురాలు పడాల భూదేవి కూడా ఈనెల 7న అనకాపల్లిలో పవన్ కల్యాణ్‌ను కలిసి జనసేన కండువా కప్పేసుకున్నారు. ఆమె కూడా జయకృష్ణ మాదిరిగా జనసేన టిక్కెట్ నాకే అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. మరోవైపు వారు దశాబ్ధాలు తరబడి కొనసాగుతున్న టిడిపికి మాత్రం రాజీనామాలు చేయలేదు. దీంతో, ఇద్దరు నాయకులు రాజీనామాలు చేయకుండా మనకి మాత్రం పంగనామాలు పెడుతున్నారంటూ పాలకొండ నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి, అక్కడక్కడ ఉన్న జనసేన కార్యకర్తలు చెప్పుకుంటున్నారు. నాయకులు లేనప్పుడు జనసేన ఈ స్థానం నుంచి టిక్కెట్ అడగడమెందుకు, టిడిపి అంగీకరించడం దేనికి అంటూ జనం (మిగతా.. 3లో)

పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరుతున్న పడాల భూదేవి (ఫైల్)

రూ.16.53 కోట్లు 'చెత్త' భారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2021 నవంబర్ 1వ తేదీన జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరుతో క్లీన్ ఎపి క్లాప్ కార్యక్రమాన్ని వైసిపి ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా చెత్త సేకరణ ప్రభుత్వం బాధ్యత కాదంటూ అందుకు అవుతున్న ఖర్చును ప్రజల నుంచి వసూలుకు శ్రీకారం చుట్టారు. దీంతో విజయనగరం ప్రజలపై ఏడాదికి రూ.6.84 కోట్ల రూపాయల భారం మోపారు. ఇలా రెండున్నరేళ్లలో ఇప్పటివరకు రూ.16.53కోట్లు ప్రజల నెత్తిన చెత్త భారం వేశారు.

కేంద్ర ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణను బడా కంపెనీలకు కట్టబెట్టడంలో భాగంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలు చెత్త నిర్వహణ బాధ్యత నుంచి తప్పుకొని అందుకు అవసరమైన ఖర్చులను ప్రజల నుంచి వసూలు చేస్తున్నాయి. కేంద్రం ఆదేశాలకు లొంగిన రాష్ట్ర ప్రభుత్వం చెత్త పన్నును ప్రజలపై రుద్దింది. నగరంలో 67,698 కుటుంబాలు, 3946 వ్యాపార సంస్థలు నుంచి చెత్త పన్ను వసూలు చేస్తున్నారు. ఒక్కో ఇంటికి నెలకు రూ.60నుంచి రూ.120 వరకు వసూలు చేస్తున్నారు. ప్రతినెలా రూ. 57లక్షల 21వేల 100 ప్రతి నెలా వసూళ్ల లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం నగరంలో 56 చెత్త వాహనాలను తిప్పుతున్నారు. ఈ వాహనాలకు ఏటా కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంది.

పారిశుధ్య నిర్వహణను ప్రైవేటీకరించి ప్రజలకు హాని చేస్తోంది. బడా కంపెనీలు, అధికార పార్టీ నేతల జేబులు నింపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో ఎన్నికైన కౌన్సిళ్లకు తెలియకుండా చెత్త వాహనాల ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా చేసుకుంది. ఒక్కొక్క వాహనానికి నెలకు 63,000 చొప్పున చెల్లించాలని నిర్ణయించింది. భవిష్యత్తులో సంవత్సరానికి కోట్ల రూపాయలు బడా కంపెనీలకు కట్టబెట్టే ఈ ఒప్పందం అన్ని నగర పాలక సంస్థల్లోనూ అమలవుతోంది. బడా కంపెనీల జేబులు నింపేందుకు వైసిపి ప్రభుత్వం చెత్త పన్నును దౌర్జన్యంగా ప్రజల నుంచి వసూలు చేస్తుంది. చెత్త పన్ను రాజ్యాంగ విరుద్ధమైనది. ఇప్పటికే ఆస్తి పన్నులో పారిశుధ్య పన్ను ఇమిడి ఉంది . చెత్త పన్ను వసూలుపై విజయనగరంలో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు తిరగబడ్డారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఈ పన్నును వ్యతిరేకించారు. పారిశుధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వాల, స్థానిక సంస్థల రాజ్యాంగ బద్ధమైన బాధ్యత. ఆ బాధ్యత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థకు హక్కులపై దాడి చేస్తుంది. ఆ బాధ్యతనుండి ప్రభుత్వాలు తప్పుకొని ప్రజల మీద భారాలు మోపుతూ, బడా కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణ సంస్కరణల విధానాన్ని తీసుకొచ్చాయి.

ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసింది, కమిషనర్ మొదలు వాలంటీర్ల వరకు చెత్త పన్ను వసూళ్లలో మునిగి తేలుతున్నారు. ప్రజలను వేధించి, పీడించి, దౌర్జన్యంగా చెత్త పన్ను వసూలు చేస్తున్నారు. నెల వారి వృద్ధులకు ఇచ్చే పెన్షన్ డబ్బులులో చెత్తపన్ను డబ్బులు కట్ చేసి మిగిలిన డబ్బులు ఇవ్వడం కొన్నాళ్లు జరిగింది. ప్రజాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో పాలకులు వెనక్కి తగ్గారు. వాస్తవానికి చెత్త పన్ను ఎప్పుడూ నగర పాలకసంస్థ ల్లో, మున్సిపాలిటీల్లో వసూలు చేయలేదు. ప్రపంచబ్యాంక్ షరుతుల్లో (మిగతా.. 3లో)

వాహనంలో చెత్త వేస్తున్న పారిశుధ్య సిబ్బంది (ఫైల్)

జగన్ ప్రభుత్వంలో ప్రజలపై పన్ను భారం

ఏడాదికి రూ.6.84కోట్లు

ఇంటింటికీ జలం.. ఇంకెంత కాలం? 3 లో

ఉద్దండుల బరి.. చీపురుపల్లి 5 లో

ఏనుగుల సమస్యకు పరిష్కారమెప్పుడో? 6 లో

ట్రాఫిక్‌లో చిక్కుకున్న విద్యార్థులు, ప్రయాణికులు

నిత్యం ట్రాఫిక్ అవస్థలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలో నిత్యం ట్రాఫిక్ స్తంభించడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. పాఠశాలలు తెరిచి, విడిచిపెట్టిన సమయంలో ట్రాఫిక్ స్తంభిస్తుంది. లైఫ్ స్టైల్ బజారు నుంచి చర్చి సెంటర్ వరకు, తాండ్రపాపరాయ, ఎన్‌టిఆర్ విగ్రహం, శ్వేతా చలపతి పాఠశాల, గౌడవీధిలో ట్రాఫిక్ స్తంభిస్తుంది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ స్తంభిస్తున్న ట్రాఫిక్ నియంత్రణకు అధికార యంత్రాంగం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభం, విడిచిపెట్టే సమయంలో ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

శంబంగిని చిత్తుగా ఓడిస్తాం

బాడంగి: నమ్మి ఓటేసిన నియోజకవర్గ ప్రజలకు ఏ మాత్రం మంచి చేయకుండా ఈ ఐదేళ్లు ముఖం చాటేసిన ఎమ్మెల్యే శంబంగిని ఈ సారి ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని టిడిపి బీసీ సాధికార కొప్పల వెలమ జిల్లా కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు అన్నారు. మంగళవారం ఆయన బాడంగిలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజలను ఏమాత్రం పట్టించుకోని ఎమ్మెల్యేని ఈసారి ఓడించే వరకు ప్రజలు తగ్గే పరిస్థితిలో లేరన్నారు సమర్థ ఎమ్మెల్యే వల్ల నియోజకవర్గం పదేళ్లు వెనక్కి వెళ్లిందని. అభివృద్ధి జాడ ఎక్కడా కానరావడం లేదని ఆరోపించారు. రోడ్లను బాగుచేసే పరిస్థితిలో కూడా లేదని ఎద్దేవా చేశారు.

ఘనంగా ఉగాది వేడుకలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజచెరువు వలసలో చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెలుగు సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఉగాది వేడుకలు నిర్వహించారు. రైతులు పశువుల పేడతో తయారు చేసిన ఎరువును పంట పొలాల్లో వేసి పంటలు బాగా పండాలని పూజలు చేశారు.

మెరకముడిదాం : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. బైరిపురంలో రామమందిరం వద్ద జరిగిన పంచాంగ శ్రవణంలో సర్పంచ్ పప్పల విజయకుమారి, వైస్ సర్పంచ్ పప్పల క్రిష్ణ మూర్తి, వైసిపి నాయకులు పప్పల గ్రహణేశ్వరరావు, మాజీ సర్పంచ్ కెంగువ ధనంజయ, కెంగువ నరసింహ మూర్తి, గ్రామ ప్రజలు, యూత్ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మెరకముడిదాం: పంచాంగం వింటున్న బైరిపురం గ్రామస్తులు

వేపాడ: మండలంలో పలు గ్రామాల్లో రామాలయాల వద్ద గ్రామ పెద్దలు అందరూ కూర్చొని ఉగాది పర్వదినాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొని ఈ ఏడాది జరగబోయే మంచి చెడులు గూర్చి రాసి ఫలాలు గూర్చి, పేరు బలాలు ఫలితాలను పురోహితులన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

నెల్లిమర్ల: ఉగాది సందర్భంగా జరజాపుపేటలో పెద మద్దిల, చిన మద్దిల కుటుంబాల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్దలు, యువత సంప్రదాయ పద్ధతిలో దుస్తులు ధరించి రాబోయే రోజుల్లో గ్రామాభివృద్ధి, వ్యవసాయ సంబంధించిన పనులపై చర్చించి ఉగాది ప్రసాదం స్వీకరించి అందరికి పంపిణీ చేశారు. కాగా రాబోయే రోజుల్లో ఇదే సంప్రదాయాన్ని పాటించి గ్రామాన్ని ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. గరికిపేట గ్రామంలో మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నెల్లిమర్ల: గరికిపేటలో పంచాంగం

బొబ్బిలి : నృత్యం చేస్తున్న చిన్నారులు

డెంకాడ: ఉగాది సందర్భంగా స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష అలంకరణలో కళ్యాణ వెంకటేశ్వర స్వామి మంగళవారం దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శ్రీమాన్ కాండూరు జగన్నాథచార్య స్వామి, శ్రీ భూసమైతుడైన శ్రీనివాసుడికి ఈ సంవత్సరమంతా శుభంగా సాగాలని, స్వామివారి అనుగ్రహం ద్వార అంతా శుభం జరగాలని అష్టోత్తర సహస్రనామార్చన పూజలు చేశారు.

ఆతవ సచివాలయం.. ఆవులకు నిలయం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని అసంపూర్తిగా ఉన్న ఆతవ గ్రామ సచివాలయ భవనం ఆవులకు నిలయంగా మారింది. ఈ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 45 లక్షలు మంజూరు చేసింది. కానీ నిధులు సకాలంలో రాక నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మధ్యలో నిలిచిపోయాయి. నిర్మాణం పనులు ప్రారంభించి నాలుగున్నరేళ్లు అవుతున్నా నిధులు రాకపోవడంతోనే పనులు పూర్తి చేయలేదని కాంట్రాక్టరు చెబుతున్నారు. రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ నిర్మాణాలు కూడా మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో సిబ్బంది గత ప్రభుత్వం నిర్మించిన పాత భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను వివరణ కోరగా బిల్లులు అప్లోడ్ చేశామని మంజూరైన వెంటనే నిధులు చెల్లిస్తామని చెప్పారు. కాగా ఈ గ్రామం ఏకగ్రీవంగా ఎన్నికైందని సర్పంచ్ అసలు అభివృద్ధిపైన దృష్టి పెట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నిర్మాణ మధ్యలో నిలిచిపోయిన సచివాలయ భవనం

మౌలిక సౌకర్యాలేవి..?

- నాలుగున్నరేళ్లు గడిచినా పూర్తికాని జగనన్న కాలనీలు
- లే అవుట్‌లకే పరిమితమైన నిర్మాణాలు
- కొన్ని గ్రామాల్లో ఇంకా తేలని స్థల సమస్య

ప్రజాశక్తి- రేగిడి

ఇల్లు లేని పేదలకు పట్టాలిచ్చి గృహ నిర్మాణాలు చేపట్టి ఊళ్ళనే నిర్మిస్తామన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రసంగంలో ఆర్భాటమే తప్ప ఆచరణ లేదని పలువురు విమర్శిస్తున్నారు. నాలుగున్నరేళ్లు పూర్తయిన నేటి వరకు పూర్తిస్థాయిలో జగనన్న కాలనీలు నిర్మాణాలు చేపట్టకపోవడం, కొన్ని నిర్మాణాలు చేపట్టిన ఆ కాలనీలకు మౌలిక సౌకర్యాలు లేక లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత టిడిపి హయాంలో స్థలం ఉన్న వారికే గృహాలు మంజూరు చేసి బిల్లులు అందించేవారు. కొన్నిచోట్ల బిల్లులు చెల్లించక లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. వైసిపి ప్రభుత్వ జగనన్న కాలనీలో నిర్మించినప్పటికీ పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టలేక, చేపట్టిన కాలనీలకు రోడ్లు, తాగునీరు తదితర మౌలిక సౌకర్యాలు లేక లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు

మండలంలోని 25 సచివాలయాల పరిధిలో 15 గ్రామాలకు సంబంధించి జగనన్న కాలనీలు నాలుగున్నరేళ్లు గడిచినా పూర్తికాక పోవడంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పూర్తయిన కాలనీలకు కనీసం మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 368 లే అవుట్‌లకు సంబంధించి 2,531 లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలు అందజేశారు. పట్టాలు ఇచ్చినప్పటికీ కొన్ని గ్రామాలలో పూర్తిగా నిర్మాణాలు చేపట్టలేదు. మరికొన్ని గ్రామాల్లో నిర్మాణాలు చేపట్టినప్పటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. ఇంకొన్ని గ్రామాల్లో లేఅవుట్ ఇచ్చినప్పటికీ కోర్టు పెండింగ్‌తో కనీసం ఒక్క ఇల్లు కూడా నిర్మాణాలు చేపట్టలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నాయి. ఒకవేళ ఇవన్నీ ఎదుర్కొని ఇళ్లు నిర్మించినా ప్రభుత్వం వాటికి మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు కూడా లేని కొండమామిడివలస జగనన్న కాలనీ

కోర్టు స్టేలతో నిలిపివేత

కొన్ని గ్రామాల్లో గత ప్రభుత్వాలు ఇచ్చిన డి పట్టా భూమును ప్రజల వద్ద నుంచి రెవెన్యూ అధికారులు తిరిగి తీసుకొని లేఅవుట్లే వేశారు. దీంతో డి పట్టాదారులు కోర్టును ఆశ్రయించారు. ఫలితంగా కోర్టు స్టే ఇచ్చింది. దీంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. జగనన్న కాలనీ ఊర్లనే తలపిస్తుందన్న ప్రభుత్వ ఊక దంపుడు ప్రసంగాలు, ప్రకటనకు అడ్డుకట్ట పడింది.

పునాదులకే పరిమితమైన సంకిలి జగనన్న కాలనీ

మండలంలోని గుల్లపాడు పంచాయతీ పరిధిలోని కొండల మామిడి వలసలో సర్వే నెంబరు1లో కొండ పోరంబోకులో రేగిడి, ఆముదాలవలస, మజ్జిరాముడు పేట, అంబకండి, సంకిలితో పాటు మరో మూడు పంచాయతీలకు జగనన్న కాలనీ మంజూరు చేశారు. 220 జగనన్న కాలనీలకు 55 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 165 వివిధ స్థాయి నిర్మాణాల్లోనే ఉన్నాయి. ఇక్కడ రోడ్లు లేక నానా అవస్థలు పడుతున్నారు. కాగితాపల్లి పంచాయతీలో 24 గృహాలు పూర్తిగా నిర్మాణాలు చేపట్టకపోవడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంకిలి గ్రామంలో సర్వే నెంబరు 319లో 75 గృహాలు, 97లో 38 గృహాలు లే అవుట్‌కే పరిమితమయ్యాయి. ఇక్కడ గతంలో ఎస్‌సి లబ్ధిదారునికి డి. పట్టా ఇచ్చారు. ఆయన జీడి మామిడి వేశారు. తిరిగి ఆ భూమిని ప్రభుత్వం వెనుక్కు తీసుకుని జగనన్న కాలనీకు ఇవ్వటంతో వన్నలి జనార్ధన కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు స్టే విధించింది. నారు జనార్ధన, పట్టాభిలకు చెందిన 25 ఏళ్లుగా హక్కుల ఉన్న స్థలంలో జగనన్న కాలనీకి స్థలం కేటాయించారు. వీరు కూడా కోర్టుకు వెళ్లడంతో స్టే వచ్చి నిర్మాణాలు జరగలేదు. ఖండ్యాంలో 18, వెంకటాపురంలో 20 గృహాలు కట్టలేదు. మునగలవలసలో 9 కి నాలుగు నిర్మాణాలు చేపట్టలేదు. వెంకంపేటలో 11 గృహాలకు ఒకటి మాత్రమే పూర్తిచేసి 10 అసంపూర్తిగా ఉన్నాయి. తోకలవలసలో 7, సరసనా పల్లెలో 6, సోమరాజుపేట 6 గృహాలకు పూర్తిగా నిర్మాణ పనులు ప్రారంభించలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే 160 జగనన్న కాలనీలో గృహాలు పూర్తిగా నిర్మాణాలే చేపట్టలేకపోయారు.

నిర్మాణానికి చాలని నిధులు

జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80లక్షలు ఇసుక, సిమెంటుకే చాలడం లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. అది కూడా కొండ ప్రాంతంలో జగనన్న కాలనీకు స్థలం మంజూరు చేయటంతో సమాన ప్రాతిపదికన పునాదులకే ఐదు లక్షల రూపాయలు అవుతుందని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. గతంలో ప్రభుత్వమే జగనన్న కాలనీలు నిర్మిస్తోందని చెప్పి, ఇప్పుడు లబ్ధిదారులే నిర్మించుకోవాలని అధికారులు చెబుతుంటే ఆశ్చర్యానికి లోనయ్యామని మండిపడుతున్నారు. ప్రభుత్వం ఇస్తున్న నిధులతో నిర్మాణాలు కష్టమని నిర్మాణ సామాగ్రి ధరలు విపరీతంగా పెరిగాయని, కూలీ రేటు కూడా పెరిగిందని ఈ నేపథ్యంలో ప్రభుత్వమే జగనన్న కాలనీలను నిర్మించాలని కోరుతున్నారు. కాగా నిర్మాణాలు పూర్తయిన జగనన్న కాలనీలకు రహదారులు, తాగనీరు, విద్యుత్ వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

పునాదులు కూడా పడని సోమరాజు పేట జగనన్న కాలనీ ఇదే..

నిర్మాణాలు వేగవంతానికి చర్యలు

జగనన్న కాలనీ నిర్మాణంలో జాప్యం వాస్తవం. నిర్మించిన కాలనీలకు రోడ్ల నిర్మాణాలపైనా జాప్యం ఉంది. కాలనీ నిర్మాణాలకు వేగవంతానికి చర్యలు తీసుకుంటాం. లబ్ధిదారులకు అవగాహన కల్పించినా ముందుకు రావడం లేదు. నిర్మాణంలో జిల్లాలో రేగిడి మండల ముందంజలో ఉంది. స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్మాణాలకు కృషి చేస్తాం.

జగన్నాథరావు, హౌసింగ్ ఎఇ, రేగిడి

ఇంటింటికీ జలం ఇంకెంతకాలం ?

• ముందుకు సాగని జలజీవన్ మిషన్ పనులు • సామాన్యుడికి అందని తాగునీరు

ప్రజాశక్తి - కురుపాం

ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరందించాలన్న ప్రభుత్వ లక్ష్యం ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం జలజీవన్ మిషన్ (జెజెఎం) నిధులతో గ్రామాల్లో చేపట్టిన పైపులైను పనుల నేటికీ కొలిక్కి రావడం లేదు. మనిషికి కనీస అవసరమైన తాగునీరు సగటున రోజుకు 55 లీటర్లు నీటిని అందిస్తున్నామంటూ అధికారులు వేస్తున్న లెక్కలు క్షేత్రస్థాయిలో ఎక్కడా కనబడడం లేదు. దీంతో ప్రైవేటు ప్లాంట్లలో తాగునీటిని కొనుక్కొని తాగే పరిస్థితి నెలకొంది.

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఇంటింటికీ తాగునీరందించాలని లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జలజీవన్ మిషన్ పథకం ద్వారా పనులు చేపట్టాయి. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 939 గ్రామాల్లో రూ.135 కోట్ల 93 లక్షలతో ఈ పనులు చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా కాంట్రాక్టర్ల ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో ఇప్పటి వరకు 165 పనులు పూర్తవ్వగా, 77 పనులు జరుగుతున్నాయిజ మిగిలిన 697 పనులు కనీసం ప్రారంభానికి నోచుకోలేదు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఎక్కడ పనులు అక్కడే నిలిపివేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టే ఈ పనులకు 50 శాతం నిధులు కేంద్రం, 50 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం పిఐఎంఎస్ అకౌంట్లో జమ చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అకౌంట్లో డబ్బులు జమ చేసిన తర్వాత, కేంద్ర ప్రభుత్వం ఖాతాకు నిధులు మళ్లిస్తుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ అకౌంట్‌కు నిధులు మళ్లించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఖాతాకు నిధులుమళ్లించడం లేదు. దీంతో బిల్లులు ఆగిపోవడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమన్వయ లోపం లేక నిధులు లభ్యతలేకపోవడం వంటి పలు కారణాలతో పనులు నిలిచిపోయాయి. దీంతో సామాన్యునికి తాగునీరందని ద్రాక్షగానే మిగిలింది. దీంతో ప్రైవేట్ ప్లాంట్లలో తాగునీరు డబ్బులు ఇచ్చి కొనుక్కునే పరిస్థితి నెలకొంది. అధికారులు మాత్రం మనిషికి సగటున రోజుకు 55 లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నామంటూ లెక్క చూపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం ఇవేమీ కాన రావడం లేదు. దీంతో తాగునీరు ఇంటి వద్దకే వస్తుందనుకునే సామాన్యుడి కల నెరవేరలేదు .

జెజెఎం పనులు చేయకపోవడంతో నీలకంఠాపురంలో నిరుపయోగంగా ఉన్న పైపులు

మండలాల వారీగా మంజూరైన నిధులు, జరిగిన పనులు వివరాలు

కురుపాం మండలంలో 323 గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరందించేందుకు రూ. 37 కోట్ల 789 లక్షలు 99 వేలు నిధులు మంజూరవ్వగా 94 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. 15 గ్రామాల్లో పనులు జరుగుతుండగా, 213 గ్రామాల్లో ఇంకా పనులు ప్రారంభించలేదు.

గుమ్మలక్ష్మీపురం మండలం లో 216 గ్రామాల్లో ఇంటింటికి తాగునీరు అందించేందుకు రూ.29 కోట్ల 18 లక్షల 49 వేలు మంజూరవ్వగా 8 గ్రామాల్లో పనులు పూర్తి అవ్వగా 9 గ్రామాల్లో ప్రస్తుతం పనులు జరుగుతుండగా 199 గ్రామాల్లో పూర్తిగా పనులు ప్రారంభించలేదు.

గరుగుబిల్లి మండలంలో 54 గ్రామాల్లో ఇంటింటికి తాగునీరందించేందుకు రూ.12 కోట్ల 85 లక్షల 8 వేలు మంజూరవ్వగా 12 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. 20 గ్రామాల్లో పనులు జరుగుతుండగా 22 గ్రామాల్లో పనులు పూర్తిగా ప్రారంభించలేదు.

జియ్యమ్మవలస మండలం లో 144 గ్రామాల్లో ఇంటింటికి తాగునీరందించేందుకు రూ.26 కోట్ల 97 లక్షల 80 వేలు మంజూరవ్వగా, 5 గ్రామాల్లో పనులు పూర్తి అవ్వగా 6 గ్రామాల్లో పనులు జరుగుతుండగా 133 గ్రామాల్లో పనులు ప్రారంభించలేదు .

కొమరాడ మండలంలో 203 గ్రామాల్లో రూ.29 కోట్ల లక్ష 10 వేలు పనులు మంజూరవ్వగా 46 గ్రామాల్లో పూర్తి అవ్వగా 27 గ్రామాల్లో పనులు జరుగుతుండగా 130 గ్రామాల్లో పనులు ప్రారంభించలేదు.

బిల్లులు అందక పనులు ఆగాయి

మా పర్యవేక్షణ నిత్యం జరుగుతున్నప్పటికీ ఇప్పటివరకు చేసిన పనులకు సక్రమంగా కాంట్రాక్టర్లకు బిల్లులు అందకపోవడం వల్ల పనులు ఆగాయి. ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తున్నప్పుడు కూడా ఎవరు పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. దీనివల్ల పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి.

ఆర్.వేణుగోపాల్, ఎఇ
ఆర్ డబ్ల్యు ఎస్
కురుపాం.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని మృత దేహం లభ్యం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల పరిధిలో గల సర్దార్ గౌతులచ్చన్న తోటపల్లి బ్యారేజి వద్ద సోమవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ అమ్మన్న రావు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని రిజర్వాయర్ నుంచి బయటకు తీయించారు. మృతుడి వయసు 50ఏళ్ల నుంచి 55ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతుడు

కోడి పందేలపై దాడి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కోడి పందేలపై దాడి చేసి 7గురి పై కేసు నమోదు చేసి నగదు, కోళ్ళు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ డి. రామగణేష్ తెలిపారు. మంగళవారం సీతారామిని పేట పరిధి జగ్గరాజుపేటలో కోడి పందేలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి 7గురుని పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.7510 నగదు, 7 పందేం కోళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారికి గాయాలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని ఎల్ కోట, సీతారాంపురం జంక్షన్ సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బట్టల వ్యాపారికి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి క్షతగాత్రుని అనుచరులు తెలిపిన వివరాల ప్రకారం.... కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన కొందరు బట్టల వ్యాపారులు విశాఖ జిల్లా పెందుర్తిలో నివాసముంటూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ గ్రామాలలో దుస్తులు విక్రయిస్తున్నారు. ఆ క్రమంలో ఎస్‌కోటలో దుస్తులు విక్రయించడానికి బట్టల వ్యాపారి పస్తం రాజు వెళ్తుండగా ఎల్ కోట సీతారాంపురం జంక్షన్ వద్ద కుక్క తన ద్విచక్ర వాహనానికి అడ్డం రావడంతో అదుపుతప్పి పడిపోయాడు. ఈ ఘటనలో వ్యాపారి రాజు కాలు, చేతికి గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచార మేరకు లక్కవరపుకోట 108 సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రునిని చికిత్స నిమిత్తం ఎల్ కోట పిహెచ్‌సికి తరలించారు.

అగ్నికి ఆహుతైన తోటలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని భరతవారిపాలెం, వేపాడలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో జీడి మామిడి తోట అగ్నికి ఆహుతైంది. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు శృంగవరపుకోట అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసినట్లు వల్లంపూడి పోలీస్ స్టేషన్ హెచ్‌సి శ్రీను తెలిపారు.

రూ.16.53 కోట్లు 'చెత్త' భారం

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా పట్టణ సంస్కరణలను తీసుకొచ్చి అందించిన సేవలకు పన్నులు వసూలు చేసే విధానానికి శ్రీకారం చుట్టారు. ఎన్నికల సంవత్సరం కావడంతో వసూలు విషయంలో కొంత వెనక్కి తగ్గిన ప్రభుత్వం ఎన్నికల అనంతరం బలవంతంగా వసూలు చేయనుంది.

లక్ష్యం రూ.16.53కోట్లు..వసూలు రూ.5.30కోట్లు

ప్రతి నెలా ఇంటి యజమానులతో సహా అద్దెదారుల నుంచి నెలకు రూ.60 నుంచి 120 రూపాయల వరకు చెత్త పన్ను వసూలు చేస్తున్నారు. చిరు వ్యాపారులు మొదలు వ్యాపారులు అందరి వద్ద నుండి నెలకు రూ.150 నుంచి 15వేల రూపాయల వరకు చెత్త పన్ను విధిస్తున్నారు. 2021 నవంబర్ నుంచి అమలు చేయడంతో ఇప్పటి వరకు రూ.16.53కోట్లుకు గాను రూ5కోట్ల 30లక్షల 20వేల 260 వసూలు చేశారు. మిగిలిన మొత్తాన్ని తర్వాత బలవంతంగా వసూలు చేయనున్నారు.

ఒకే నాయకుడు.. రెండు పార్టీలు

ప్రశ్నించుకుంటున్నారు. మొత్తానికి పోలింగ్ తేదీ దగ్గర పడుతున్నప్పటికీ పాలకొండలో జనసేన, టిడిపి కూటమి తమ అభ్యర్థిని ప్రకటించలేని దుస్థితి దాపురించింది. మరోవైపు ఇదే అదునుగా వైసిపి అభ్యర్థి హేట్రిక్ సాధించే దుకు చాపకింద నీరులా పావులు కదుపుతు న్నారు. ఒకే పార్టీలో ఉంటూనే నిన్నమొన్నటి వరకు ఉత్తర దక్షిణ ధ్రువాల్లో ఉన్న కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌బాబు కలిసి నియోజకవర్గ రాజకీయాలను చక్కబెట్టు కుంటున్నారు.

అవనాపు స్ఫూర్తితో ప్రజాసేవ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తన తండ్రి అవనాపు సూరిబాబు స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపడతామని ఆయన కుమారుడు, ఉత్తరాంధ్ర వైసిపి యూత్‌వింగ్ ఇన్‌ఛార్జి అవనాపు విక్రమ్ తెలిపారు. విజయనగరం మున్సిపల్ మాజీ చైర్మెన్ అవనాపు సూరిబాబు 12వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటం వద్ద అవనాపు విక్రమ్ భావన దంపతులు నివాళులు అర్పించారు. విజయనగరంలో ప్రముఖ వ్యాపారవేత్తగా, సహృదయుడిగా ఆపదలో ఉన్నవారికి సహాయం చేసే మానవత్వం ఉన్న వ్యక్తిగా సూరిబాబు పేరొందారని తెలిపారు. తన తండ్రి వర్ధంతి రోజున సేవా కార్యక్రమాలు చేయడం అలవాటని అన్నారు. తమ తండ్రి అవనాపు సూరిబాబు, పెద్దనాన్న అవనాపు అప్పలనాయుడు జ్ఞాపకార్థం ఈ సంవత్సరం నాగావళి సంక్షేమ సంఘానికి అంతిమయాత్ర వాహనాన్ని తాను, తన సోదరుడు విజయ్ కలిసి అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అవనాపు విక్రమ్ సతీమణి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, కుటుంబ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి కార్యక్రమంలో తనయుడు విక్రమ్

సూరిబాబు చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న విక్రమ్, అభిమానులు

ప్రతి ఒక్కరికీ మంచి జరగాలి : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్రోధి నామ సంవత్సర ఉగాది ప్రారంభం నుంచి ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఆకాంక్షించారు. ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం తెలుగు సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని కోలగట్ల నివాసంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మశ్రీ సాంబశివ శాస్త్రి పంచాంగ శ్రవణాన్ని వినిపించారు. వివిధ రాశుల వారి ఆదాయ వ్యయాలు, రాజపూజ్యం అవమానాలను వెల్లడించారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో అనుకున్న సమయానికి వర్షాలు కురుస్తాయని, పంటలు సమృద్ధిగా పండుతాయని తెలిపారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడుతుం దని చెప్పారు. మొత్తం మీద శ్రీ క్రోధినామ సంవత్సరం అందరి జీవితాలలో వెలుగులు నింపుతాయని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్చపువలసలో గోవిందమ్మ పేరంటాల పండగ

ప్రజాశక్తి వీరఘట్టం

మండలంలోని అచ్చపువలసలో గోవిందమ్మ తల్లి పేరంటాలు యాత్ర మంగళవారం ప్రముఖ యజ్ఞకర్త ఎస్వీఎల్ ఎన్ శర్మ యాజీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది ఉగాది పర్వదినాన పురస్కరించుకొని ఈ యాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రంగురంగుల విద్యుత్తు కాంతులతో ఆ ప్రాంతమంతా జిగేల్ జిగేల్ మనిపించారు. ఈ యాత్రకు వీరఘట్ట మండలంతో పాటు జియ్యమ్మవలస, సీతంపేట, పాలకొండ, గరుగుబిల్లి, వంగర, తదితర మండలాల నుండి వేలాదిమంది భక్తులు విచ్చేసి గోవిందమ్మ తల్లి పేరంటాలని దర్శించుకొనే తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ఉగాది వేడుకలు

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని ఉగాది సందర్భంగా మండలంలోని నడుకూరులో సాయి మారుతీ ధ్యాన మందిరంలో పాలకొండ నియోజకవర్గ జన సైనికులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తూర్పుకాపు రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయుడు బబ్బాది పకీర్ నాయుడు, జనసేన క్రియాశీలక సభ్యత్వ వాలంటీర్ మత్స పుండరీక, జనసేన జానీ,సాయిపవన్, చిన్ని, రమణ, అనిల్ వీర మహిళలు పాల్గొన్నారు.

భోగాపురం టూ నెల్లిమర్ల



- మూడు మండలాల నుంచి నాలుగు మండలాలకు విస్తరణ
- కనుమరుగైన కాంగ్రెస్, టిడిపి
- బరిలో వైసిపి, జనసేన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ప్రస్తుత నెల్లిమర్ల నియోజకవర్గం గతంలో భోగాపురం నియోజకవర్గంగా ఉండేది. అప్పటి భోగాపురం నియోజకవర్గంలో భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాలుండేవి. 2009లో నియోజకవర్గాల పుణర్విభజనలో భాగంగా నెల్లిమర్ల మండలాన్ని ఇందులో కలిపి నెల్లిమర్ల నియోజకవర్గంగా రూపాంతరత చెందింది. 1955లో భోగాపురం నియోజకవర్గం ఏర్పడింది. ఈ నియోజకవర్గంలో 2009 వరకూ 12 సార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మొదటిగా ప్రజాసోషలిస్ట్ పార్టీ విజయం సాదించగా, ఐదు సార్లు కాంగ్రెస్, ఆరు సార్లు టిడిపి విజయకేతనం ఎగరవేసాయి. 1955లో భోగాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగే మొదటి ఎన్నికకు 57,809 మంది ఓటర్లు ఉండేవారు. అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి ఆర్. సన్యాశిరావుపై ప్రజా సోషలిస్ట్ పార్టీ అభ్యర్థి బొత్స ఆదినారాయణ (మాజీ మంత్రి పడాల అరుణ తండ్రి) సుమారుగా 15వేల ఓట్లు మెజార్టీతో విజయం సాదించారు. 1962లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా కొమ్మూరు అప్పడుదొర బరిలో దిగారు. ఆయనపై బొత్స ఆదినారాయణ ప్రజా సోషలిస్ట్ పార్టీని వదిలి ఇండిపెండెంటుగా బరిలోకి దిగారు. ఆ కాలంలో నియోజకవర్గంలో 53,201 ఉండగా 37,051 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో అప్పడుదొర సుమారుగా 11 వేల ఓట్లు మెజార్టీతో గెలిపొందారు. 1967 ఎన్నికల్లో అప్పడు దొరపై ఇండిపెండెంటుగా ఎం. సత్యనారాయణ (పూసపాటిరేగ ఎంపిపి భర్త పండుశ్రీను తండ్రి) పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 1972 ఎన్నికల్లో అప్పడుదొరపై బి. రామునాయుడు ఇండిపెండెంటుగా పోటీ చేసి ఓటమి చవిచూసారు. 1978లో అప్పడుదొరపై జనతా పార్టీ నుండి పతివాడ నారాయణస్వామి నాయుడు బరిలోకి దిగినా ఓటమి తప్పలేదు. 1983 తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో టిడిపి తరుపున పతివాడ నారాయణస్వామినాయుడు పోటీచేసి అప్పడుదొరపై సుమారుగా 9,436 ఓట్లు మెజార్టీతో విజయం సాదించారు. అప్పడుదొర మొదటి సారి పతివాడ చేతిలో ఓటమి చవిచూసారు. అప్పటి నుండి వరుసగా 1985, 1989, 1994, 1999, 2004 ఎన్నికల్లో అప్పడుదొర, అతని తమ్ముడు సంజీవరావుపై పతివాడ విజయ దుందిబి మోగించారు.

నియోజకవర్గ పుణర్విభజన

నియోజకవర్గ పుణర్విభజనలో భాగంగా 2009లో భోగాపురం నియోజకవర్గం నెల్లిమర్ల నియోజకవర్గంగా మారింది. పునర్విభజన తరువాత వచ్చిన తొలి ఎన్నికల్లో టిడిపి నుంచి పతివాడ, కాంగ్రెస్ అభ్యర్థిగా బడ్డుకొండ అప్పలనాయుడు, ప్రజారాజ్యం పార్టీ నుండి కొమ్మూరు సంజీవరావు అల్లుడు కందుల రఘుబాబు మధ్య త్రిముఖ పోటీ జరిగింది. ఈ ఎన్నికల్లో పతివాడ స్వల్ప ఓట్లుతో ఓటమి చవిచూసారు. కాంగ్రెస్ అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు విజయదుందబి మోగించారు. 2014 ఎన్నికల్లో టిడిపి తరుపున పతివాడే బరిలో ఉన్నారు. కాంగ్రెస్ తరుపున బడ్డుకొండ, వైసిపి తరుపున డి. సురేష్‌బాబు మధ్య త్రిముఖ పోటీ జరిగింది. అయితే పతివాడ నారాయణస్వామి నాయుడు ఏడోసారి ఎమ్మెల్యేగా విజయం సాదించారు. 2019లో పతివాడపై వైసిపి నుండి బడ్డుకొండ అప్పలనాయుడు పోటీ చేసి సుమారుగా 28 వేల ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. ఇలా ఇప్పటి వరకూ జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పతివాడ నారాయణస్వామి నాయుడు ఏడుసార్లు, కొమ్మూరు అప్పడుదొర నాలుగుసార్లు, బడ్డుకొండ అప్పలనాయుడు రెండు సార్లు, బొత్స ఆదినారాయణ ఒకసారి విజయం సాదించడం ఈ నియోజకవర్గం ప్రత్యేకత. అప్పడుదొర జలగం వెంగళరావు మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసారు. ఈయన సోదరుడు అప్పలస్వామి (సంజీవరావు) విశాఖ ఎంపిగా ఒకసారి విజయం సాదించారు. పతివాడ నారాయణ స్వామినాయుడు 2004 ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో చక్కెర, ఉద్యాణవన శాఖా మంత్రిగా, 2014లో ప్రోటెం స్పీకర్‌గా గౌరవం పొందారు.

టిడిపి, కాంగ్రెస్ గల్లంతు

మొదటి నుండి నువ్వా నేనా అన్న చందగా టిడిపి, కాంగ్రెస్ పార్టీలు ఈ నియోజకవర్గంలో పోటీ పడేవి. కాలంతో పాటు పార్టీలో వస్తున్న మార్పులు వల్ల 2024 ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు గల్లంతయ్యాయి. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పై జనసేన (కూటమి) నుండి లోకం మాధవి పోటీలో ఉన్నారు. ఈ సారి విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

ఎండల తీవ్రతతో నిర్మానుష్యంగా మారిన సీతంపేట ప్రధాన రహదారి

ఎండలు బాబోయ్...

అల్లాడిపోతున్న వృద్ధులు, పిల్లలు

ప్రజాశక్తి - సీతంపేట

ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో ఫిబ్రవరి నెలలోనే ఎండల తీవ్రత ప్రారంభమైంది. ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు అత్యధికంగా పెరగడంతో ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎండలు తీవ్రత అధికంగా ఉండడంతో రోడ్డుపైకి ప్రజలెవరూ రాకపోవడంతో రహదారులు నిర్మానుషంగా మారాయి. ఇప్పటికే ఏజెన్సీలో 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు ఉండడంతో ప్రజలు ఎండ తీవ్రతను తట్టుకోలేకపోతున్నారు. ఒకవైపు ఇళ్లల్లో వేడికి ఉండలేక, బయటి ఎండలోకి చెట్టు నీడకు వెళ్లలేక ఎండ తీవ్రతకు మగ్గిపోతున్నారు. ప్రయాణికులు ఉదయం 9గంటల్లోపు, లేకుంటే సాయంత్రం 5గంటల తర్వాత ప్రయాణిస్తే బాగుంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. గెడ్డలో చెరువుల్లో నీరు లేక పశువులు దాహార్తిని తీర్చుకోలేక నాన ఇబ్బందులు పడుతున్నాయి. ఈ సమయంలో చిన్న పిల్లలు, వృద్ధులు ఎండల్లో ప్రయాణిస్తే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. అత్యవసర ప్రయాణం తప్పదంటే గొడుగు లేక టోపి, గ్లూకోజ్, కొబ్బరి నీరు, మజ్జిగ తరచుగా తీసుకొని అక్కడక్కడ విశ్రాంతి తీసుకుని ప్రయాణించాల్సి ఉంటుంది. మరోపక్క చిన్న పిల్లలు ఈ వేడిని తట్టుకోలేక జ్వరంతో పాటు వేడి కురుపులయ్యే ప్రమాదం ఉందని ఇప్పటికే వైద్యులు కూడా సూచనలు ఇస్తున్నారు. ఇక ఏప్రిల్ మొదటి వారంలో ఎండలు ఇంత తీవ్రత ఉంటే ఇక మే నెల జూన్ నెలలో ఎలా ఉంటుందో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇక పశువులను కూడా ఉదయాన్నే మేతకు పంపించి పదిగంటల్లోపు ఇంటికి వచ్చేలా తీసుకురావడం మంచిదని పశువైద్యులు సూచిస్తున్నారు. ఎక్కువగా నీరు పెడితే ఆరోగ్యంగా ఉంటుందని పశు వైద్యులు చెబుతున్నారు.

ఆర్‌బికె ఊసలకే పరిమితం

ప్రజాశక్తి - వీరఘట్టం

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు పంపిణీతో పాటు నాణ్యమైన ఎరువులు అందించేందుకు వీలుగా ఆర్‌బికెల నిర్మాణానికి శ్రీకారం చుట్టుంది. అధికారుల అలసత్వం వల్ల కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించక రైతు భరోసా కేంద్రాల నిర్మాణం ఊసలకే పరిమితమైంది. మండల కేంద్రంతో పాటు రేగులపాడు, దశమంతపురం, వండువ, తెట్టంగి, హుస్సేన్‌పురం, కత్తుల కవిటి, బిటివాడ, చిదిమి, చలివేంద్రి, సంతనర్సిపురం, నడుకూరు, కిమ్మీ, చిట్టపూడివలస, నడిమికెల్లా, కంబర, చినగోరకాలనీ, తలవరం, పనసనందివాడ, తదితర గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే బిటివాడ, హుస్సేన్ పురం, కత్తులకవిటి, కిమ్మీ, రేగులపాడు గ్రామంలో రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు చేసుకుని ప్రారంభోత్సవాలు కూడా జరిగాయి. మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలతో పాటు దశమంతపురం గ్రామాల రైతు భరోసా కేంద్రాలు ఊసలతో దర్శనమిస్తున్నాయి. స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో నాలుగు సచివాలయాల్లో ఎక్కడా రైతు భరోసా కేంద్రాలు పూర్తి కాకపోవడంతో ప్రస్తుతం వీటిని నిర్వహణ మార్కెట్ యార్డు ఓ భాగంలో రైతు భరోసా కార్యకలాపాలు సాగుతున్నాయి.

వీరఘట్టంలో తుప్పపట్టి ఊసలతో దర్శనమిస్తున్న ఆర్‌బికె

వేసవిలోనూ రంగుమారిన నీరు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వేసవిలో కూడా రంగు మారిన తాగు నీర సరఫరా చేయడమేమిటని పట్టణ ప్రజలు బహిరంగంగానే మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. పట్టణంలో మంగళవారం 24, 25, 26, 27 వార్డుల్లో కుళాయిల ద్వారా రంగు మారిన తాగునీరు సరఫరా చేయడంతో ఆయా వార్డు స్థానికులు అసహనం వ్యక్తం చేస్తూ గత్యంతరం లేక ఆ నీటినే పట్టుకొని వడపెట్టుకొని మరిగించుకుని వాడుకోవడం జరుగుతుందని, తాగునీటి సరఫరా జరిగేటప్పుడు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు కనీస పర్యవేక్షణ చేయకపోవడంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు స్పందించి శుద్ధమైన తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కుళాయి ద్వారా వస్తున్న రంగుమారిన నీరు

సార్వత్రిక సంగ్రామం

ఉద్దండుల బరి చీపురుపల్లి



అత్యధికంగా టిడిపి ఆరుసార్లు గెలుపు ● జస్టిస్ పున్నయ్య గెలిచింది ఇక్కడి నుంచే

ప్రజాశక్తి- చీపురుపల్లి

చీపురుపల్లి నియోజకవర్గం ఎందరో ఉద్దండులకు నిలయం. నాడు..నేడు రాష్ట్రంలో వెలుగొందిన నాయకులను ఈ నియోజకవర్గం అందించింది. కుల వివక్ష నిర్మూలనపై ప్రభుత్వం వేసి కమిషన్‌కు చైర్మన్‌గా వ్యవహరించిన జస్టిస్ పున్నయ్య ఇక్కడ నుంచే పోటీ గెలుపొందారు. 1957లో ముదుండి సత్యన్నారాయణరాజు(బిఎ రాజు) కేవలం ఎనిమిది ఓట్ల ఆదిక్యంతో గెలుపొంది అప్పట్లో సంచలనం సృష్టించారు.

జిల్లాలో బిసిలు అధికంగా ఉండే నియోజకవర్గం అంటే టక్కున గుర్తొచ్చేది చీపురుపల్లి నియోజకవర్గం. ఈ నియోజకవర్గంలో ప్రస్తుతం 2,03,178 మంది ఓటర్లున్నారు. ఇందులో మహిళా ఓటర్లు 1,01595 మంది ఉండగా పురుషులు 1,01574 మంది, ఇతరులు 9 మంది ఓటర్లున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాలలో 120 గ్రామ పంచాయితీలుండగా 150 రెవెన్యూ గ్రామాలున్నాయి. వాటిలో 257 పోలింగ్ బూత్‌లున్నాయి. చీపురుపల్లి మండలం 48,657 మంది ఓటర్లు, గరివిడి 55,524 మెరకముడిదాం 46,251, గుర్ల మండలంలో 52,746 మంది ఓటర్లున్నారు. నియోజకవర్గం ఏర్పడిన తరువాత 15 సార్లు అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. ఇందులో తెలుగుదేశం పార్టీ ఆరు దఫాలు, స్వతంత్రులు, కాంగ్రెస్ పార్టీలు చెరో రెండు సార్లు, కాంగ్రెస్ (ఐ) మూడు పర్యాయాలు, వైసిపి ఒక దఫా గెలిచాయి. 1951, 1955 సంవత్సారాలలో చీపురుపల్లి నియోజకవర్గం ద్విసభ్య నియోజకవర్గంగా ఉండేది. ఇక్కడ నుండి తొలిసారిగా పోతులు గున్నయ్య కాంగ్రెస్ పార్టీ నుండి ప్రాతినిధ్యం వహించారు. ఆయనపై కెఎల్‌పి తరుపున కొత్తపల్లి పున్నయ్య పోటీ చేసి ఓడిపోయారు. తరువాత ఎన్నికలలో అదే పార్టీకి నుండి కొత్తపల్లి పున్నయ్య పోటీ చేసి సిపిఐకి చెందిన ఎం. కూర్మయ్యపై గెలుపొందారు. 1951లో జరిగిన ఏక సభ్య ఎన్నికల్లో తాడ్డి అచ్చంనాయుడు స్వతంత్ర్య అభ్యర్ధిగా పోటీ చేసి తన ప్రత్యర్ధి ముదుండి సత్యన్నారాయణరాజు (బిఎ రాజు) పై 57 ఓట్లు స్వల్ప ఆదిక్యంతో గెలుపొందారు. 1957లో జరిగిన ఎన్నికల్లో కెఎల్‌పి నుండి తాడ్డి అచ్చంనాయుడు పోటీ చేయగా మళ్లీ ప్రత్యర్ధిగా నిలిచిన ముదుండి సత్యన్నారాయణరాజు(బిఎ రాజు) కేవలం ఎనిమిది ఓట్ల ఆదిక్యంతో గెలుపొందారు. 1962లో జరిగిన ఎన్నికలలో కోట్ల సన్యాసప్పలనాయుడు స్వతంత్ర అభ్యర్ధిగా పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ తరుపున

పోటీ చేసిన ముదుండి సత్యన్నారాయణరాజుని ఓడించారు. 1967లో తాడ్డి రామారావు ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్ధి అయిన కోట్ల సన్యాసప్పలనాయుడు(కాంగ్రెస్) పై ఆరు వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 1972లో జరిగిన ఎన్నికలలో రౌతు పైడిపినాయుడు (పోలి నాయుడు) కాంగ్రెస్ పార్టీ తరుపున బరిలో నిలచిన ఎం సత్యన్నారాయణరాజుపై నాలుగు వేల ఓట్లు ఆధిక్యంతో గెలుపొందారు. 1978లో జరిగిన నియోజక వర్గాల పునర్విభజనలో జిల్లాలోని చీపురుపల్లి, గరివిడి, శ్రీకాకుళం జిల్లాలోని గంగువారి శిగడాం, పొందూరు మండలాలతో చీపురుపల్లి నియోజకవర్గం ఏర్పడింది. అప్పుడు జరిగిన ఎన్నికలలో చిగిలిపల్లి శ్యామలరావు కాంగ్రెస్(ఐ) పార్టీ తరుపున పోటీచేసి తన సమీప ప్రత్యర్ధి అయిన టంకాల అక్కలనాయుడుపై గెలిపొందారు. ఈ ఎన్నికలలో గెలుపొంది శ్యామలరావు గిరిజన శాఖా మంత్రిగా పని చేశారు. 1982లో ఎన్‌టి రామారావు తెలుగుదేశం పార్టీని ప్రారంభించారు. 1983లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధిగా పోటీ చేసిన గొర్లె శ్రీరాములునాయుడిపై టిడిపి నుంచి పోటీ చేసిన త్రిపురాన వెంకటరత్నం 23 వేల ఓట్లు మెజార్టీతో గెలిపొందారు. టిడిపి ప్రభుత్వంలో త్రిపురాన వెంకటరత్నం మంత్రిగా పని చేశారు. 1985 ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్ధి విజయం సాధించారు. అనంతరం 1989లో జరిగిన ఎన్నికలలో మీసాల నీలకంఠం నాయుడు (కాంగ్రెస్) తెలుగుదేశం పార్టీ అభ్యర్ధి అయిన టంకాల సరస్వతమ్మ చేతిలో 10 వేల ఓట్ల తేడాతో ఓడి పోయారు. 1994లో జరిగిన ఎన్నికలలో టిడిపి అభ్యర్ధిగా పోటీ చేసిన గద్దే బాబూరావు కాంగ్రెస్ తరుపున పోటీ చేసిన కెంబూరి రామ్మోహనరావుపై 18 వేల ఓట్లు మెజార్టితో గెలుపొందారు. 1999లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన మీసాల నీలకంఠం నాయుడు తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసిన గద్దే బాబూరావు చేతిలో 4,500 ఓట్లు తేడాతో ఓడిపోయారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్ధిగా బొత్స సత్యన్నారాయణ తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసిన గద్దే బాబూరావుపై 11,034 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి మంత్రి వర్గంలో పరిశ్రమలు, గృహనిర్మాణ, మార్కెటింగ్ శాఖ మంత్రిగా బొత్స సత్యన్నారాయణ పని చేశారు. 2008లో నియోజకవర్గాల పునర్విభజన తరువాత శ్రీకాకుళం జిల్లాలో ఉన్న గంగువారి శిగడాం, పొందూరు మండలాలను తప్పించి మెరకముడిదాం, గుర్ల మండలాలను చీపురుపల్లి నియోజకవర్గంలో విలీనం అయ్యాయి. 2009లో జరిగిన ఎన్నికలలో టిడిపి అభ్యర్ధి గద్దే బాబూరావుపై కాంగ్రెస్ అభ్యర్ధిగా పోటీ చేసిన బొత్స సత్యన్నారాయణ 5,942 ఓట్లు ఆధిక్యంతో గెలుపొందారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విభజన తరువాత 2014లో జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసిన కిమిడి మృణాళిని కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన బొత్స సత్యన్నారాయణపై సుమారు 22,800 ఓట్లు మెజార్టీ సాధించి గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికలలో వైసిపి తరుపున పోటీ చేసిన బొత్స సత్యన్నారాయణ తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసిన కిమిడి నాగార్జునపై సుమారు 26 వేల ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రి వర్గంలో బొత్స సత్యన్నారాయణ మున్సిపల్ శాఖ, విద్యాశాఖా మంత్రిగా పనిచేశారు. ఇప్పటి వరకు 15 దఫాలుగా జరిగిన ఎన్నికలలో చీపురుపల్లి నియోజకవర్గం నుండి 1994 వరకు ఏ ఒక్కరూ రెండు దఫాలుగా ఎమ్మెల్యేగా ఎన్నిక కాలేదు. ఆ తరువాత 1994, 1999లలో జరిగిన ఎన్నికలలో గద్దే బాబూరావు రెండుసార్లు, 2004, 2009, 2019 ఎన్నికలలో బొత్స సత్యన్నారాయణ మూడ సార్లు గెలిపొందారు.

ప్రభుత్వ కొలువులు వదిలి

అమృత కుమారి

కళావతి

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ నియోజకవర్గం ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారిలో ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగులే. పాలకొండ నియోజకవర్గం ఎస్‌సి రిజర్వ్‌డ్ నియోజకవర్గంగా ఉన్నప్పటి నుంచి నేటివరకు అనేక మంది ఉద్యోగాలు వదిలి శాసనసభలోకి అడుగుపెట్టారు. 2009లో నియోజకవర్గ పునర్జీవనమైన తర్వాత కూడా ఉద్యోగులే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 1983 ఎన్నికల్లో టిడిపి తరుపున గెలిచిన ఎమ్మెల్యే గోనెపాటి శ్యామలరావు ఆర్‌అండ్‌బి డిపార్ట్మెంటులో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి, ఉద్యోగాన్ని వదిలి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 1986లో పిజె అమృత కుమారి ఇరిగేషన్ శాఖలో ఉద్యోగం చేసి, రాజీనామా చేసి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1996లో కూడా ఇండిపెండెంటుగా పోటీ చేసి విజయం సాధించారు. బ్యాంక్ ఉద్యోగాన్ని వదిలుకొని తలే భద్రయ్య రాజకీయాల్లోకి వచ్చి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009 ఎన్నికల్లో పంచాయతీరాజ్ శాఖలో డ్రాఫ్ట్ మాన్‌గా పని చేసిన నిమ్మక సుగ్రీవులు ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014, 2019 ఎన్నికలలో వైసిపి తరుపున ఎమ్మెల్యేగా ఉన్న విశ్వాసరాయి కళావతి స్టేట్ బ్యాంక్ ఉద్యోగం వదులుకుని రాజకీయాల్లోకి చేరారు.

సుగ్రీవులు

వీరభద్రయ్య

పలు ప్రాంతాల్లో పాలకొండ వాసులే ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ ప్రాంతానికి చెందిన నేతలే చుట్టుపక్కల నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా గెలిచిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎన్నికల్లో కూడా పాలకొండ నియోజక వర్గానికి చెందినవారే అభ్యర్థులుగా ఉన్నారు. గతం నుండి ఇప్పటివరకు కూడా ఇదే జరుగుతుంది. పాలకొండకు చెందిన పైడి శ్రీరామ్మూర్తి 1978,1989 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఆముదాలవలస నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. అలాగే ఇక్కడ ఎమ్మెల్యేగా గెలుపొందిన కంబాల జోగులు 2014, 2019 ఎన్నికల్లో రాజాం నియోజకవర్గంలో వైసిపి తరపున పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన వైసిపి తరపున పాయకరావుపేట నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. అదేవిధంగా ప్రస్తుతం రాజాం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న తలే రాజేష్ కూడా పాలకొండ వాసినే. ఈయన తండ్రి తలే భద్రయ్య గతంలో టిడిపి తరపున 1985, 1994

పద్మావతి

రాజేష్

పాలకొండ ఎస్సీ నియోజకవర్గంలో గెలుపొందారు. పాతపట్నం ప్రస్తుత ఎమ్మెల్యేగా ఉన్న రెడ్డి శాంతి కూడా పాలకొండ వాసినే. ఆమె తాత పాలవలస సంఘంనాయుడు పాలకొండ నియోజకవర్గ మొదటి ఎమ్మెల్యేగా పని చేశారు. అలానే ఆమె తండ్రి పాలవలస రాజశేఖరం అనేక పదవులు చేసి పాలకొండలోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. అదే విధంగా కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి తాత పాలకొండ మండలంలోని టిడి పారాపురానికి చెందిన వారే. అలాగే ప్రస్తుతం పార్వతీపురం నియోజకవర్గంలో కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న బత్తిన



మోహనరావు

మోహనరావు కూడా పాలకొండకు చెందినవారే. పాలకొండ నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి అక్కడ రాజకీయాల్లో చక్రం తిప్పుతున్న పాల కొండ వాసులను చూసి ఇక్కడి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏనుగుల సమస్యకు పరిష్కారమెప్పుడో?

ప్రాణాలు పోతున్నా పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలో 18 ఏళ్లుగా ఏనుగుల సమస్య ప్రజలను వెంటాడుతుంది. కాంగ్రెస్, టిడిపి, వైసిపి ప్రభుత్వాల హయాంలో ఏనుగుల తరలింపునకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు ఏనుగుల సమస్యపై కనీసం మాట్లాడడంలేదు. ఏనుగుల దాడితో ప్రజల ప్రాణాలు పోతున్నా, పంటలకు నష్టం వాటిల్లినా కనీసం పట్టించుకునే పాపాన పోలేదు. 2006లో ఒడిశా ప్రాంతం లకేరి అడవుల నుంచి గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతానికి 11 ఏనుగుల గుంపు వచ్చింది. ఆనాడు వీటిని తరలించే క్రమంలో, వివిధ కారణాల రీత్యా పలు ఏనుగులు చనిపోయాయి. ప్రస్తుతం కురుపాం నియోజకవర్గంలోని జియమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లో గల నదీ ప్రవాహక ప్రాంతాల్లో ఏడు ఏనుగులు జనావాసాల మధ్య సంచరిస్తూ గత 18 ఏళ్లుగా జన జీవనానికి తీవ్ర ఇబ్బందులను గురిచేస్తున్నాయి. 18 ఏళ్ల కాలంలో ఏనుగుల దాడిలో ఇప్పటివరకు సుమారు 15 మంది వరకు గిరిజనులు, రైతులు, ఎలిఫెంట్ ట్రాకర్లు, విలేకరులు మృత్యువాత పడ్డారు. ఏనుగుల దాడిలో ప్రజలు మరణిస్తున్నా అటు ప్రభుత్వం కానీ, ఇటు పాలకులు గానీ ఏనుగులను తరలించడం, ప్రజలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని పలువురు గిరిజన సంఘాల నాయకులు, ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఫ్యాక్టరీల పేరుతో అడవులను నాశనం చేయడంతో అడవిలో ఉండాల్సిన ఏనుగులకు రక్షణ కరువై, ఆహారం దొరక్క ఇలా జనావాసాల్లోకి వస్తున్నాయని పలువురు పర్యావరణవేత్తలు చెబుతున్నారు. అడవుల్లో ఉండాల్సిన వన్యప్రాణులు ప్రజల మధ్య తిరుగుతూ వారి ప్రాణాలను, పంటలను సర్వ నాశనం చేస్తూ జనజీవనానికి ఆటంకంగా మారాయి. దీంతో రైతులు పంట పొలాలకు వెళ్లలేక, ఇంటి వద్ద ఉండలేక బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఏ క్షణానికి ఏనుగుల గుంపు గ్రామంపై దాడి చేస్తుందోనని ప్రజలు అనుక్షణం భయపడుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో భామిని మండలంలో గత కొన్నేళ్లు నుంచి ఒక ఏనుగుల గుంపు, మరోవైపు బలిజిపేట మండలంలో కూడా మరో ఏనుగుల గుంపు దాడులు చేస్తూ పలువురుని పొట్టన పెట్టుకుంటున్నాయి. కురుపాం మండలం తూర్పు ముఠా ప్రాంతంలో కూడా అడవి ఏనుగులు తిరుగుతున్నాయిని గిరిజనులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో పెద్దపులి, ఎలుగుబంట్లు సంచారం కొన్ని రోజుల పాటు సాగినా ప్రజలకు ఎటువంటి హాని చేయకుండా వెళ్లిపోవడంతో హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఏనుగుల గుంపు బెడద మాత్రం జిల్లాలో నాలుగు దిక్కుల తిరుగుతూ ప్రజా జీవనానికి తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి.

ప్రాణాలు తీస్తున్నాయి...

గత కొన్నేళ్ల నుంచి కురుపాం నియోజకవర్గంలో ఏనుగుల గుంపు సంచరించడంతో ప్రజలకు కంటి మీద కునుకులేకుండా పోయింది. వివిధ పనుల రీత్యా పొలాలకు వెళ్లిన వారు, నదీ ప్రాంతానికి వెళ్లిన వారు ఏనుగుల దాడిలో మృత్యువాత పడ్డారు. గత 18 ఏళ్లలో ఇప్పటి వరకు ఏనుగుల దాడిలో సుమారు 15 మంది వరకు మృతి చెందడంతో ఆ కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ప్రభుత్వం నుంచి కొంతమేర నష్టపరిహారం వచ్చినా ఆ కుటుంబంలో వ్యక్తి మృతి చెందడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నారు. ఏనుగులు రోజుకొకరిపై దాడి చేస్తున్నా అటవీశాఖ అధికారులు మాత్రం రక్షణ చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారు. గుమ్మలక్ష్మీపురం ప్రాంతానికి వచ్చిన అడవి ఏనుగుల గుంపు మొట్ట మొదటిసారిగా బొడ్లగూడ గ్రామ సమీపంలో శాంతమ్మ అనే గిరిజన మహిళను తొక్కి చంపేశాయి. ఈ సంఘటన జరిగిన వారంలోపే లుంబేసు పంచాయితీ వాడబాయి గ్రామ సమీపంలో ఉన్న కొండపాక వద్ద ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వృద్ధులను, ఒక చిన్నారిని పొట్టన పెట్టుకున్నాయి. అదే క్రమంలో ఇరిడి గ్రామ సమీపంలో పెద్దగూడకు చెందిన గిరిజన వ్యక్తిని, చెముడు గూడ పంచాయతీ అడ్డంగూడకు చెందిన బిడ్డిక సోంప అనే వృద్ధురాలిని గెడ్డకు వెళ్లి వస్తుండగా గ్రామ సమీపంలోనే దాడి చేసి చంపాయి.

అలాగే వీరఘట్టం మండలం హుస్సేన్ పురంలో న్యూస్ కవరేజ్‌కి వెళ్లిన విలేకరిపై దాడి చేసి ప్రాణాలు తీశాయి. భామిని మండలం ఘనసర వద్ద చిన్నారావు అనే రైతును, ఏనుగులను తరలించే క్రమంలో పసుకుడి గ్రామ సమీపంలో ఎలిఫెంట్ కేర్ ట్రేకర్ లోకుండ లక్ష్మీనారాయణ ను పొట్టన పెట్టుకున్నాయి. బలిజిపేట మండలం చెల్లింపేటలో అడపా దేశి నాయుడు అనే వృద్ధుడిపై ఏనుగులు దాడి చేసి ప్రాణాలు తీశాయి. జియమ్మవలస, కొమరాడ మండలాల్లో కూడా పలువురుపై దాడి చేసి ప్రాణాలు తీయడమే కాకుండా, రైతులు పండించుకున్న పంటలను, వాటర్ మోటార్లను, అంగన్వాడీ భవనం తలుపులు ధ్వంసం చేసిన సంఘటనలు నేటికీ ప్రజల కళ్లముందు కనిపిస్తున్నాయి.

కొమరాడలో బస్సుపై దాడి చేస్తున్న ఏనుగు (ఫైల్)

ఆగిపోయిన ఆపరేషన్ గజ

అప్పటి అటవీశాఖ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో ఉన్న అడవి ఏనుగులు గుంపును ఒడిశా ప్రాంతానికి తరలించేందుకు ఆపరేషన్ గజ కార్యక్రమానికి ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. తమిళనాడు నుంచి శిక్షణ పొందిన జయంతి అనే మగ ఏనుగును తీసుకొచ్చి అడవి ఏనుగులు గుంపును తరలించేందుకు పలు రకాలుగా ప్రయత్నాలు చేసినా అది పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదు. దీంతో ఆ కార్యక్రమానికి ప్రభుత్వం ఫుల్ స్టాఫ్ పెట్టారు.

ఏనుగులను తరలించాలి

జిల్లాలో ప్రజల ప్రాణాలను తీస్తున్న అడవి ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి ఒడిశా ప్రాంతానికి తరలించేలా ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టాలి. ఏనుగుల దాడితో విలువైన ప్రాణాలు, పంట, ఆస్తి నష్టం జరుగుతున్నా ప్రభుత్వం రక్షణ చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు

ఏనుగుల బారి నుంచి ప్రజలను కాపాడాలి

జిల్లాలో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న అడవి ఏనుగుల గుంపు బారి నుంచి ప్రజలను ప్రభుత్వం కాపాడే చర్యలు చేపట్టాలి. ఏనుగుల సంచారం తో రైతులు పంట పొలాలకు వెళ్లలేని పరిస్థితి. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందించాలి.

మండంగి రమణ,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి

ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

పండగ పూట పనులు... అయినా అందని వేతనాలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉగాది పండుగ పూట కూడా ఉపాధి కూలీలు చెరువు పనులకు హాజరయ్యారు. ఎమ్మార్‌నగరం, సంగంవలస రంగాలగూడ, లచ్చున్నదొరవలస గ్రామాల్లో మంగళవారం పర్యటించిన సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఈ సందర్భంగా వారితో కలుసుకొని మాట్లాడగా, వేతనదారులు స్పందిస్తూ ఈరోజు పనికి వస్తే రోజు పని ఉంటుందని కూలీలు అభిప్రాయపడ్డారు. చేసిన పనికి 14 రోజుల్లో వేతనాలు చెల్లించాలని చట్టంలో ఉన్నప్పటికీ పార్వతీపురం మండలంలో 6 నుంచి 8 వారాలు కావస్తున్నా బిల్లులు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ పనులు చేయకుండా రోడ్డులు మెటీరియల్ కాంపోనెంట్ బిల్లులు చేసుకొని కూలీలకు అన్యాయం చేస్తున్నారని కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశారని విమర్శించారు. సోషల్ ఆడిట్లు సక్రమంగా జరగలేదన్నారు. వీటిపై కలెక్టర్ సమగ్ర దర్యాప్తు చేయాలని, శ్రమ చేసిన ఉపాధి కూలీల బకాయి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనదారులకు బకాయి కూలీలు వెంటనే చెల్లించాలని లేకపోతే సిపిఎం తరఫున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని అధికారులను హెచ్చరించారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మల్లిలో గల బాలుర ప్రతిభా కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి పార్వతీపురంలో ఉన్న 8వతరగతి ప్రతిభా పాఠశాలలో ప్రవేశానికి ఆదివారం సీతంపేట బాలిక గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ప్రతిభా కళాశాల ప్రవేశానికి 302 మంది దరఖాస్తు చేయగా, 214 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ప్రతిభ పాఠశాల ప్రవేశానికి 101 మంది విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తు చేయగా 88 మంది పరీక్ష రాశారు. ఈ పరీక్షలను కళాశాల ప్రిన్సిపల్ అరుణజ్యోతి పర్యవేక్షించారు .

జామియా మసీదులో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - కురుపాం

పవిత్రమైన రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిములకు ఎఎంసి వైస్ చైర్మన్ మాజీ షేక్ షాదుల్లాబాషా మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మాజీమంత్రి శత్రుచర్ల విజయరామరాజు, మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ దేవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్, ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి పాల్గొన్నారు .రాష్ట్రంలో ముస్లిం లకు అన్ని విధాలా తెలుగు దేశం ఆదుకుంటుందని, తమ పార్టీ హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని నాయకులు తెలిపారు. రంజాన్ ముందు రంజాన్ తోఫా నిత్యావసర వస్తువులు అందజేసేదని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్లు కోలా రంజిత్ కుమార్, డొంకాడ రామకృష్ణ, పలువురు ముస్లిం మతపెద్దలు, తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న టిడిపి నాయకులు

టిడిపి ఆధ్వర్యాన ఉగాది వేడుకలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

రాష్ట్రంలో కొనసాగుతున్న రాక్షస పాలన ముగిసిపోయి రానున్నది ప్రజల ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. టిడిపి నియోజకవర్గ అభ్యర్థి బోనెల విజయచంద్రతో కలిసి మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ఉగాది సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పరిపాలనపై ప్రజలు పూర్తిస్థాయిలో విసిగిపోయి ఉన్నారని, త్వరలో జరగబోయే ఎన్నికల్లో అక్రమ పద్ధతుల్లో గెలవాలని అనుకుంటున్నా వైసిపి అభ్యర్థులకు రాష్ట్రవ్యాప్తంగా ఘోర పరాజయం తప్పదని అన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో...

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన బైపాస్ రోడ్డులోగల ఆ పార్టీ కార్యాలయంలో ఉగాది వేడుకలు జరగాయి. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారిని కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు జీవన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు

ఉగాది వేడుకల్లో పాల్గొన్న టిడిపి నాయకులు విజయచంద్ర, జగదీష్

ప్రజాశక్తి 7
బుధవారం 10 ఏప్రిల్ 2024

విద్యా ప్రదాత అల్లూరి మూర్తిరాజు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ వైద్య కళాశాల వ్యవస్థాపకులు స్వర్గీయ అల్లూరి మూర్తిరాజు విద్యా ప్రదాత అని ఆయన కుమారుడు, మిమ్స్ మెడికల్ కళాశాల చైర్మన్ అల్లూరి సత్యనారాయణరాజు (బాబీ) అన్నారు. స్వర్గీయ మూర్తిరాజు జయంతి వేడుకలను మిమ్స్ క్యాంపస్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ సత్యనారాయణరాజుతో పాటు మిమ్స్ యాజమాన్య ప్రతనిధులు, పలువురు ఉద్యోగులు తొలుత మూర్తి రాజు సమాధిని దర్శించుకుని పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. క్యాంపస్‌లోని మూర్తిరాజు విగ్రహం వద్ద ఆయన చిత్ర పటం ఉంచి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మిమ్స్ చైర్మన్ సత్యనారాయణరాజు మాట్లాడుతూ నెల్లిమర్లలోని మిమ్స్ వైద్య కళాశాలతో పాటు రాష్ట్ర రాష్టేతర ప్రాంతాలో ఎన్నో విద్యా సంస్థలను ఏర్పాటు చేసి విద్యా సేవ చేసిన ఘనత మూర్తిరాజుకే దక్కుతుందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే తొలి ప్రైవేటు వైద్య కళాశాల మిమ్స్‌ను ఏర్పాటు చేసి ఈ ప్రాంత విద్యార్థులకు వైద్య విద్య అందించారని కొనియాడారు. వైద్య కళాశాల ఏర్పాటు కారణంగా ఇటు విద్యార్థులకు వైద్య విద్య అందించడంతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిషా రాష్ట్రాలకు చెందిన ఎంతో మంది రోగులు వైద్య, సేవలు పొందుతున్నారని అన్నారు. ఎంతో మంది స్థానికులకు కూడా ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయన్నారు. ఆయన స్థాపించిన మిమ్స్‌ను అన్ని రంగాలుగా బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సత్యనారాయణరాజు సూచించారు. ఆయన ఆశయాల సాధనకు సమిష్టి కృషితో ముందుకు వెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మూర్తి రాజు మేనల్లుడు జివిఎస్ఎన్ వర్మ, మిమ్స్ వైద్య కళాశాల ప్రతినిధులు, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

మిమ్స్ చైర్మన్ సత్యనారాయణరాజు ఉద్ఘాటన

మూర్తిరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

2కె వాక్‌లో పాల్గొన్న తహశీల్దార్లు, బిఎల్‌ఒలు

14 వరకూ కొత్త ఓటర్ల నమోదు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఈ నెల 14 వరకూ కొత్తగా ఓటర్లు తమ ఓటును నమోదు చేసుకోవచ్చునని రిటర్నింగ్ అధికారి మురళీ కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలో బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలైన రాంప్ సౌకర్యం, మరుగుదొడ్లు, పోలింగ్ రోజున పోలింగ్ సిబ్బందికి వసతి సౌకర్యం, ఓటర్లకు తాగునీటి సదుపాయం కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలు చేయాలని, హోం ఓటింగ్ పై సెక్టారు అధికారులతో సమన్వయం చేసుకొని అర్హత కలిగిన వారికి హోం ఓటింగ్ సదుపాయం కల్పించేలా చూడాలని అన్నారు. పోలింగ్ జరిగే రోజు వరకు ప్రతి బిఎల్ఒ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం 2కే వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మొన్న టిడిపి ..నిన్న వైసిపి

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలోని ఆరికతోట గ్రామానికి చెందిన సుమారు 80 కుటుంబాలు మాజీ సర్పంచ్ పెంకి భీమయ్య ఆధ్వర్యంలో స్థానిక మండల వైసిపి కార్యాలయంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు సమక్షంలో వైసిపిలో చేరాయి. వారికి ఎమ్మెల్యే శంబంగి పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వ్యక్తులు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం టిడిపి నాయకులు ప్రలోభాలకు గురిచేసి కండువాలు వేయించి పార్టీలో చేర్చారని అయితే తామంతా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు, చేస్తున్న అభివృద్ధి పనులకు మెచ్చి, స్థానిక ఎమ్మెల్యే శంబంగి పనితీరును మెచ్చి ఆ పార్టీ వీడి స్వచ్ఛందంగా ఈ పార్టీలో చేరుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సరస్వతి, జిల్లా వైసిపి మహిళా విభాగం కార్యదర్శి అప్పికొండ నిర్మల, పెంకి శేఖర్ బాబు, మండల జెసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పిఎసియస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, విశాఖ డెయిరీ అధ్యక్షులు చొక్కాపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

శృంగవరపుకోట: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని మండలంలోని శివరామరాజుపేట గ్రామానికి చెందిన జనసేన పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కొట్యాడ లోకాభి రామకోటి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆర్కే గ్రాండ్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గొంప కృష్ణ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారని నియోజకవర్గంలోని ఎంతోమంది జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు రాజీనామాలు చేసామని ఆయన టిడిపి అధిష్టానం ఒత్తిడి మేరకు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం వల్ల కార్యకర్తలందరూ నిరాశ చెందామని చెప్పారు. రాజీనామాలు చేసిన, నిరాశ చెందిన కార్యకర్తలు అందరి నిర్ణయం మేరకు వచ్చే ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని అన్నారు. నియోజకవర్గంలో ఒక కుటుంబానికి చెందిన వారే దశాబ్దాల తరబడి రాజకీయాలు చేస్తున్నారని మరే ఇతర నాయకులను ఎదగనీయటం లేదని ఈ నేపథ్యంలో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేస్తానని ఆయన అన్నారు

పోటీలో పాల్గొని తలబడుతున్న ఎడ్ల బండి

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు ప్రదర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వావిలిపాడులో నూకాలమ్మ పండగను పురస్కరించుకొని నిర్వహించిన ఎడ్ల పరుగు పందేం ఆకట్టుకుంది. ఈ పరుగు ప్రదర్శనలో విజేతులుగా నిలిచిన ఎడ్ల బళ్ల యజమానులకు గ్రామస్తులు సమకూర్చిన నగదును గ్రామ పెద్దలు చేతులు మీదుగా అందించారు.

ఆతవలో వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆతవలో వైసిపి నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ప్రతి ఒక్కరూ మరోసారి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వివి. చిన రామునాయుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకట్రావు, ఎంపిటిసి రాజేష్, సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణకు యత్నం

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని నాయుడు కాలనీ గాయత్రి డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న చెరువును ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తు న్నారు. చెరువు పక్కనున్న వారు చెరువులో వ్యర్థాలను వేసి కప్పి వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువును కాపాడా ల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువులో మట్టి వేయడంతో పాటు చేపలు పట్టేందుకు వీలులేకుండా ముళ్ల కంపలు వేస్తున్నారు. దీంతో చెరువులో చేపలు పెంచేందుకు మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. చేపలు పెంచకుండా చెరువు ఖాళీగా ఉంటే పూర్తిగా ఆక్రమించుకునే అవకాశం ఉంటుందని అక్రమార్కులు ప్రణాళికలు వేసినట్లు విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్, రెవెన్యూ అధికారులు స్పందించి చెరువు ఆక్రమణకు గురికాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణకు గురవుతున్న చెరువు

విద్యుత్ బిల్లు సవరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండల ంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన విద్యుత్ బిల్లు సవరించినట్లు ఎఇ పిచ్చయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ కొండగుంపాం గ్రామానికి చెందిన సతివాడ రాములమ్మకు ఇటీవల రూ.44,718 విద్యుత్ బిల్లు రావడంతో ఆమె ఆందోళనకు గుర య్యారు. ఈ నేపథ్యంలో పలు పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. దీనికి స్పందించిన ఎఇ మంగళవారం పరిశీలించి విద్యుత్తు బిల్లును సవరించి రూ. 64 బిల్లును తిరిగి జారీ చేసినట్లు తెలిపారు. మీటర్‌లో సాంకేతిక కారణంగా కొన్ని సందర్భాల్లో బిల్లు అధిక మొత్తంలో చూపెడుతుందని తెలిపారు. అధిక మొత్తంలో వచ్చిన విద్యుత్ బిల్లును అన్ని విధాల తనిఖీలు చేసి సవరించి తిరిగి ఇచ్చిటన్లు ఎఇ పిచ్చయ్య తెలిపారు.

సవరించిన బిల్లును చూపిస్తున్న బాధితుడు


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

వైసిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద వైసిపి నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ మంగళవారం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రేగిడి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు సౌలభ్యం కోసం కార్యాలయాన్ని ప్రారంభించా మన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ధార అప్పల నరసమ్మ, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్ మోహన్ రావు, మండల యూత్ పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మండల జేసిఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్ కుమార్, పెంటం నాయుడు, పిల్ల గౌరి నాయుడు, చక్రపాణి, రెడ్డి నరసింగరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో నిర్వాహకులు

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఉగాది సందర్భంగా ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ సౌజన్యంతో బ్యాడ్మింటన్ జూనియర్స్, సీనియర్స్ విభాగంలో మంగళవారం సింగిల్స్ పోటీలు నిర్వహించామని చీఫ్‌కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ పోటీల్లో సింగిల్స్ 15 మంది పాల్గొన్నారని జూనియర్స్ విభాగంలో జె.కుషాల్, అఖిల్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని చెప్పారు. సీనియర్స్ విభాగంలో బి.హారిక, ఎం.జాన్సన్, యం.పూర్ణ చంద్రశేఖర్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు, కోచ్ అస్లాం తల్లిదండ్రులు యం.సత్యం బహుమతులు ప్రధానం చేశారన్నారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సరసనాపల్లిలో డిఎస్‌పి మహేంద్ర, సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్ఐ ఈ శ్రీనివాసరావు, ఆర్‌పిఎస్‌ఎఫ్, ఇతర కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చి నిర్వహించాయి. మే 13న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించడానికి ఈ కవాతు నిర్వహిస్తున్నామని డిఎస్‌పి తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరారు.

సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎస్‌పి మహేంద్ర

సామాన్య కార్యకర్త నుంచి సిపిఎం అభ్యర్థిగా...

మండంగి రమణ ప్రస్థానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న సాధారణ ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థిగా పోటీలో నిలుస్తున్న మండంగి రమణ ఆ పార్టీలో సాధారణ కార్యకర్త నుంచి ఎదిగారు. గిరిజన సంఘం నాయకుడిగా అనేక గిరిజన సమస్యల పై జరిగిన పోరాటాల్లో పాల్గొన్నారు.

రమణ 1994లో మొదటిసారిగా సిపిఎం పార్టీలో చేరారు. అప్పటి సిపిఎం నాయకులు కీర్తిశేషులు పత్తిక హరిచంద్రుడు గిరిజనుల పక్షాన చేస్తున్న ఉద్యమాలు , పోరాటాలకు రమణ ఆకర్షితుడై సిపిఎంలో చేరారు. హరిశ్చంద్రుడు సేవా కార్యక్రమాల స్ఫూర్తితో సిపిఎంలో చేరి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. మంచి మనిషిగా, ప్రజా సేవకుడుగా మన్యం ప్రాంతంలో రమణ గుర్తింపు తెచ్చుకున్నారు. గిరిజనులకు కష్టమొస్తే పగలైనా రాత్రయినా అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంలో ముందుంటున్నారు. గిరిజనుల హక్కులు, చట్టాలు, పోడు పట్టాలు, గిరిజన యువతకు ఉద్యోగ ఉపాధి కల్పన, గ్రామంలో తాగునీరు, రోడ్లు, వైద్యం వంటి మౌలిక వసతుల కల్పన కోసం సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసి పరిష్కారానికి కృషి చేశారు. గిరిజనులు పండించే అటవీ ఫల సాయాలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎన్నోసార్లు జిసిసి, ఐటిడిఎ కార్యాలయం ఎదుట గిరిజనులతో కలిసి పోరాటాలు చేసి వారికి మద్దతుగా నిలిచారు.

సర్పంచి, ఎంపిటిసిగా కొనసాగుతూ...

గిరిజనులు, దళితులు, బిసిలు, ఉద్యోగులు, వ్యాపారుల సహకారంతో మండంగి రమణ రెండుసార్లు సర్పంచ్‌గా, మరో రెండు సార్లు ఎంపిటిసిగా గెలుపొందుతూ వస్తున్నారు. 2004లో మొదటిసారిగా ఎల్విన్ పేట పంచాయతీ సర్పంచ్ గా ఎన్నికయ్యారు. రెండోసారి 2009లో ఎంపిటిసిగా గెలుపొందారు. మళ్లీ 2014లో ఎల్విన్ పేట సర్పంచిగా విజయం సాధించారు. 2021లో జరిగిన ఎన్నికల్లో రిజర్వేషన్ మార్పులు కారణంగా చెముడు గూడ ఎంపిటిసిగా పోటీ చేసి గెలుపొందారు. రేషన్ కార్డులు, పింఛన్లు, గ్రామాల్లో బోర్లు, సిసి రోడ్లు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా కృషి చేస్తూ ఉత్తమ ప్రజా ప్రతినిధిగా గిరిజన గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. తాజాగా సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న రమణ ఇప్పటికే తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

జలవిహార్‌లో బోట్ షికారు చేస్తున్న పర్యాటకులు

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి -సీతంపేట

ఉగాది సందర్భంగా సీతంపేట ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ పర్యాటకులతో నిండిపోయింది. జిల్లా నలుమూలల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. పార్క్‌లో ఉన్న అందాలను ఆస్వాదించారు. యువతీ యువకులు జలవిహార్ వద్ద బోట్ షికారు చేశారు. యువతీ యువకులు హేంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కర్లు కొట్టారు. కమాండో నెట్ ఎక్కి చిన్నారులు ఆడుకున్నారు. ఆనంద విహార వద్ద డాన్సులు వేసి కేరింతలు కొట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

తోటపల్లిలో ఘనంగా ఉగాది వేడుకలు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ఉత్తరాంధ్రలో చిన తిరుప తిగా ప్రసిద్ధి చెందిన తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవారి ఆలయాల్లో ప్రధాన అర్చకులు వి వి అప్పలాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వ హించారు. దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి వివి సూర్యనారాయణ తెలిపారు. క్రోధి నామ సంవత్సరం ఉగాది సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొందూరు సుధాకుమార్ శర్మచే పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒ సూర్యనారాయణ, సిబ్బంది గంటా శ్రీధర్‌నాయుడు, పి.పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.

దండుమారమ్మ ఉత్సవాలు ప్రారంభం

ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎస్‌పి దీపిక దంపతులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

కంటోన్మెంటులోని దేవీ దండుమారమ్మ దేవాలయంలో అమ్మవారి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 16 వరకు ఈఉత్సవాలు జరుగనున్నాయి. ప్రారంభ వేడుకల్లో విజయనగరం ఎస్‌పి ఎం. దీపికా పాటిల్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతోను స్వాగతం పలికారు. అనంతరం ఎస్‌పి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి పసుపు కుంకుమలు, వస్త్రాలు సమర్పించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు ఉగాది, దండుమారమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

దండుమారమ్మ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12న సామూహిక సహస్రనామ కుంకుమార్చన ఉదయం 9 గంటల నుండి జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. 16న అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని సాయంత్రం 5.30 గంటలకు డప్పులు, చిత్ర, విచిత్ర వేషాలతోను, కోలాటాలు, ప్రత్యేక కాళికా వేషంలోను, సాంస్కృతిక కార్యక్రమాలతోనూ ఊరేగింపు నిర్వహించనున్నట్లుగా కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 20న ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, పార్వతీపురం ఎఆర్ డిఎస్‌పి అప్పారావు, విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు, ఆర్ఐలు ఎన్. గోపాలనాయుడు, రమేష్, శ్రీరాములు, శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు తాతరాజు, రవీశ్వరుడు, వాసు, శివ, లక్ష్మణ్, వాసు, శ్రీనివాసరావు, బోనంగి నాయుడు, బంగారి నాయుడు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

దండుమారమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్‌పి దీపిక దంపతులు

ఘనంగా ఉగాది వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

శ్రీ క్రోధి నామ నూతన సంవత్సరం ఉగాది వేడుకలు దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాయింటు కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక జ్యోతి ప్రజ్వలన చేసి ఉగాది వేడుకలను ప్రారంభించారు. నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలకు అన్ని విధాలా మేలు జరగాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో మక్కువ భ్రమరాంబమల్లిఖార్జున స్వామి దేవాలయ అర్చకులు అరవెల్లి విజయకుమార్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఉగాది పర్వదినం సందర్భంగా జిల్లాలో విశిష్ట సేవలందించిన 62 ఏళ్ల పైబడి వయస్సు కలిగిన వివిధ దేవాలయాలకు చెందిన తొమ్మిది మంది అర్చకులను జాయింట్ కలెక్టర్ సత్కరించి, పురస్కారాలు అందించారు. ఉగాది పచ్చడి, ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ జి.కేశవనాయుడు, దిశా డిఎస్‌పి హర్షిత, దేవాదాయశాఖ అధికారి డివివి ప్రసాదరావు, ఎగ్జిక్యూటివ్ అదికారులు వివి సూర్యనారాయణ, మురళీకృష్ణ, టి.రమేష్, ఎం ప్రసాద్, పురస్కారగ్రహీతలు, ప్రజలు హాజరైనారు.

పాలకొండ : ఉగాది పండగ సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు బౌరోతు శంకరరావు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పద్యాల పోటీలో విద్యార్థులు పోటీ పడి ఆకట్టుకున్నారు. గొట్టమంగళాపురం పాఠశాలకు చెందిన కోట్ల అశ్విత, ప్రథమ బహుమతి సాధించగా, స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన పి.స్వప్న, ద్వితీయ, బెజ్జిపురం పాఠశాలకు చెందిన రుచిత, పాలకొండ ఉన్నత పాఠశాలకు చెందిన భువనశ్రీ తృతీయ బహుమతులు సాధించారు. వీరికి ఉపాధ్యాయుడు వావిలపల్లి గోవిందరావు బహుమతులు అందజేశారు. కనపాక చౌదరి నాయుడు, గణేశ్వరరావు, సాహిణి శ్రీనివాసరావు, శ్రీదేవి, సూరన్నాయుడు, భౌరోతు మల్లేశ్వరరావు కవితలను కవి గానం చేశారు.

సీనియర్ అర్చకులను సన్మానిస్తున్న జెసి శోభిక తదితరులు

సీతంపేట : తెలుగు సంవత్సరాది శ్రీక్రోధి నామ సంవత్సరం సందర్భంగా ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో అర్చకులు శ్రీ వేమకోటి సాయి కృష్ణ శర్మ పూజలు నిర్వహిస్తూ పంచాంగం కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది వర్షం, పంటలు, ఆరోగ్యం, నష్టాలు, వ్యాపారాలు ఎలా ఉంటాయన్న అంశంపై పంచాంగం నిర్వహించారు. అంతేకాక కొత్త సంవత్సరం సందర్భంగా రైతులు తెలుగు సాంప్రదాయంతో ఉట్టిపడేలా తెల్లపంచెలు ధరించి కొత్త నాగళ్లతో పొలాల బాట పట్టారు.

తెలుగు పండగల్లో ఉగాదిది అగ్రస్థానం

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాల బాలికల హాస్టల్‌లో ఉగాది వేడుకను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బొత్స ఝాన్సీలక్ష్మి, కళాశాల డైరెక్టర్ మజ్జి శశి భూషణ్ రావు, ప్రిన్సిపాల్ డివి రామమూర్తి, చీఫ్ వార్డెన్ కెప్టెన్ మీసాల సత్యవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ తెలుగు వారు ప్రత్యేకంగా జరుపుకునే పండుగల్లో ఉగాదికి అగ్రస్థానం ఉంటుందన్నారు. కళాశాల డైరెక్టర్ శశి భూషణ్‌రావు మాట్లాడుతూ షడ్రచుల సమ్మేళనంగా చేసే ఉగాది పచ్చడి జీవితంలో జరిగే వివిధ అనుభవాలను సూచిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగవంశ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

శ్రీ క్రోధి నామ సంవత్సర తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలు నాగవంశ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన మంగళవారం జరిగాయి. ఆ సంఘం భవనంలో మంగళవారం సంఘ అధ్యక్షులు, వైసిపి నాయకులు అవనాపు విక్రమ్ దంపతులు పాల్గొన్నారు. ప్రముఖ పంచాంగ కర్త తనికెళ్ల ప్రభాకర శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. ఈ సంవత్సర కాలంలో వచ్చే పుష్కరాలు, శుభ ముహూర్తాలు వివరాలు వివరించారు. ఆయా రాశుల వారికి సంవత్సర ఫలితాలు వివరించారు. ఈ సందర్భంగా అవనాపు విక్రమ్ గారు మాట్లాడుతూ ప్రతి ఏటా ఈ విధంగా తెలుగు సంవత్సరాది ఉగాది రోజున పంచాంగశ్రవణం నిర్వహించాలని భావిస్తున్నామన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు భవిష్యత్తు తరాలకు అందజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మెన్ కాళ్ల గౌరీశంకర్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కనకల మురళీమోహన్, మాజీ కౌన్సిలర్ గాడు అప్పారావు, నాగవంశ సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉగాది సంబరాల్లో పాల్గొన్న సీతం కళాశాల విద్యార్థులు